సాక్షి
నాగర్‌కర్నూల్
గురువారం । 3 । జూలై । 2025



నేత కార్మికులకు జియోట్యాగ్

నేత కార్మికులకు జియోట్యాగ్ నంబర్లు జారీ చేస్తామని ఆ శాఖ అధికారి తెలిపారు.

వివరాలు 8లో ▸



6న లక్ష పుష్పార్చన

తొలి ఏకాదశి సందర్భంగా 6న కురుమూర్తి ఆలయంలో పుష్పార్చన నిర్వహించనున్నారు.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
32.3 /20.7

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గాలులతో కూడిన ఓ మోస్తారు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేడు పోలీస్ డ్యూటీ మీట్ కార్యక్రమం

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో గురువారం పోలీసు డ్యూటీ మీట్‌ను ప్రారంభిస్తున్నామని ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రెండు రోజులపాటు జరిగే ఈ కార్యక్రమానికి ఉమ్మడి జిల్లాల నుంచి పోలీసు అధికారులు హాజరవుతారని తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఓల్డ్ పోలీస్ హెడ్ క్వార్టర్స్, న్యూ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో పోలీసు డ్యూటీ మీట్‌లో క్రైమ్ ఇన్వెస్టిగేషన్, మెడికో లీగల్ టెస్ట్, లిఫ్టింగ్ అండ్ ప్యాకింగ్ ఆఫ్ ఎక్సిబిట్స్, ఫింగర్ ప్రింట్స్, క్రైమ్ సీన్ ఫొటోగ్రఫీ అండ్ వీడియోగ్రఫీ, అబ్జర్వేషన్ టెస్ట్, డాగ్ స్క్వాడ్, ఫోరెన్సిక్ సైన్స్ రిటన్ టెస్ట్ నిర్వహించనున్నట్లు తెలిపారు.

విద్యార్థినులు చదువుపై దృష్టి సారించాలి



నాగర్‌కర్నూల్ క్రైం: విద్యార్థినులు చదువుపై శ్రద్ధ వహించడంతో పాటు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రెటరీ నసీం సుల్తానా అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు అందుబాటులో ఉన్నాయని, చదువుకొని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అమ్మాయిలు సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలని, అపరిచిత వ్యక్తుల నుంచి ఫోన్లు వచ్చినపుడు స్పందించకూడదని సూచించారు. సోషల్ మీడియాలో వ్యక్తిగత ఫొటోలు, వివరాలు ఎవరికి పంపవద్దన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రవికాంతరావు ఉన్నారు.

సైబర్ నేరగాళ్లతో అప్రమత్తం



వెల్దండ: సైబర్ నేరగాళ్లతో విద్యార్థులు, యువత అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైమ్ బ్రాంచ్ డీఎస్పీ గిరికుమార్ కల్కోట సూచించారు. మండలంలోని గుండాల ఏకలవ్య పాఠశాలలో ఆయన విద్యార్థులకు సైబర్ నేరాలు, మత్తు పదార్థాల నిషేధం, బ్యాంకింగ్ తదితర అంశాలపై అవగాగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలు అడిగినప్పుడు సమాధానం ఇవ్వకూడదన్నారు. సోషల్ మీడియాలో అపరిచిత వ్యక్తులతో స్నేహం చేయరాదని, విద్యార్థులు చదువుపై ప్రత్యేక దృష్టి పెట్టి ఉత్తమ ఫలితాలను సాధించాలని ఆకాంక్షించారు. పేదరిక నిర్మూలన కేవలం చదువుతో జయించవచ్చన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి తల్లిదండ్రులు, గురువులకు సమాజంలో పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ భాస్కర్, ఏఎస్ఐ జక్కివ్లా, పోలీస్ సిబ్బంది శ్రీను, కృష్ణ, మహేష్, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.



'ఈ ఫొటోలో కన్పిస్తున్నది కొల్లాపూర్ మున్సిపాలిటీకి చెందిన చెత్త డంపింగ్‌యార్డు. పట్టణంలో వెలువడే టన్నుల కొద్దీ చెత్తను తీసుకెళ్లి నల్లమల అటవీ ప్రాంతం, కృష్ణాతీరంలోని అమరగిరి పచ్చని కొండల మధ్య డంపింగ్ చేస్తున్నారు. గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా చెత్తను వేస్తుండటంతో స్థానికులు, పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారు. చెత్త నిర్వహణ లేక తరచుగా కాలుస్తుండటంతో పర్యావరణ కాలుష్యం చోటుచేసుకుంటోంది.'



'జిల్లాకేంద్రంలోని మున్సిపాలిటీ డంపింగ్ యార్డులో సైతం చెత్త నిర్వహణ అస్తవ్యస్తంగా కొనసాగుతోంది. సెగ్రిగేషన్ షెడ్డు, ప్లాస్టిక్ రీసైక్లింగ్ ప్రక్రియ చేపట్టడం లేదు. డంపింగ్‌యార్డులో చెత్త గుట్టలుగా పేరుకుపోతోంది.'

'జిల్లాలోని కల్వకుర్తి మున్సిపాలిటీకి సంబంధించిన చెత్త డంపింగ్ యార్డు ఇది. ఇక్కడ సైతం రోజూ చెత్తకు నిప్పు పెట్టి కాల్చేయడం పరిపాటిగా మారింది. తడి, పొడి చెత్త సేకరణ, సెగ్రిగేషన్, ప్లాస్టిక్ రీసైక్లింగ్ అనే ఊసే లేదు.'



నెరవేరని లక్ష్యం

జిల్లాలో అమలుకాని చెత్త రీసైక్లింగ్, ఎరువుల తయారీ

- కొల్లాపూర్‌లో అడవిలో డంపింగ్ చేస్తున్న వైనం
- కాల్చడమే మేలనుకుంటున్న సిబ్బంది
- నిరుపయోగంగా సెగ్రిగేషన్ షెడ్లు



'ఇది అచ్చంపేట మున్సిపాలిటీకి చెందిన డంపింగ్‌యార్డు పరిస్థితి. చౌటపల్లి శివారులో ఏర్పాటు చేసిన డంపింగ్‌యార్డులో చెత్తను కాల్చడం నిత్యకృత్యంగా మారింది. సేకరించిన చెత్తను వేరు చేసి వర్మీ కంపోస్టు, ఎరువులను తయారు చేయాల్సి ఉండగా.. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. చెత్తను తగలబెడుతుండటంతో పరిసరాలు విషపూరితంగా మారుతున్నాయని ప్రజలు వాపోతున్నారు.'



అచ్చంపేట మున్సిపాలిటీలో నిర్వహణకు నోచుకోని సెగ్రిగేషన్ షెడ్

సాక్షి, నాగర్‌కర్నూల్: జిల్లావ్యాప్తంగా మున్సిపాలిటీల్లో డంపింగ్ యార్డుల్లో చెత్త నిర్వహణ అస్తవ్యస్తంగా సాగుతోంది. రోజువారీగా సేకరించిన చెత్తను రీసైక్లింగ్ చేసి సేంద్రియ ఎరువులు తయారు చేసి ఆదాయం సమకూర్చుకోవాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అధికారుల నిర్లక్ష్యం గండికొడుతోంది. నిత్యం టన్నుల కొద్ది సేకరించిన చెత్తను బహిరంగ ప్రదేశాల్లో వేసి కాల్చుతుండడంతో అటు ప్రజలకు, ఇటు పర్యావరణానికి ముప్పుగా మారుతోంది. దీనికి తోడు జిల్లాకేంద్రంలో మూడు, నాలుగు రోజులకు ఒకసారి చెత్త సేకరిస్తున్నారు. తడి, పొడి చెత్త కలిపి వాహనాల్లో నింపుతున్నారు. చెత్తలోని ప్లాస్టిక్ సీసాలు, కవర్లను వేరు చేసి రీసైక్లింగ్ కేంద్రానికి పంపాల్సి ఉండగా, మిగిలిన తడిచెత్తను కంపోస్టు ఎరువుగా తయారుచేయాల్సి ఉండగా, ఎక్కడా ఈ ప్రక్రియ అమలుకు నోచుకోవడం లేదు.



అమరగిరిలో రోడ్డుపైనే పారబోసిన చెత్త

కనిపించని ఎరువుల తయారీ..

జిల్లాలోని మున్సిపాలిటీల్లో డంపింగ్ యార్డుల వద్ద కంపోస్టు ఎరువుల తయారీ కోసం సెగ్రిగేషన్ షెడ్లను ఏర్పాటు చేశారు. ఇందుకోసం సుమారు రూ. 50 లక్షల నుంచి రూ.కోటి వరకు నిధులను వెచ్చించారు. కానీ ఎక్కడా ఎరువులు, కంపోస్టు తయారీ చేపట్టడం లేదు. తడిచెత్తను సేకరించి ఎరువుగా మార్చితే మున్సిపాలిటీలకు ఆదాయ వనరులుగా మారే అవకాశం ఉంది. సేంద్రియ ఎరువులను హరితహారం కింద నాటిన మొక్కలకు వినియోగించేందుకు అవకాశం ఉండగా ఎక్కడా అమలుకావడం లేదు.

చెత్తయార్డుగా మార్చారు



కొల్లాపూర్ మున్సిపాలిటీకి చెందిన చెత్తను రోజూ తీసుకొచ్చి మా గ్రామ శివారులో ప్రధాన రోడ్డు పక్కనే వేస్తున్నారు. స్థానికులతో పాటు పర్యాటక ప్రాంతమైన అమరగిరికి వస్తున్న పర్యాటకులు దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే పలుమార్లు అధికారులు విన్నవించినా చర్యలు తీసుకోవడం లేదు.

– భరత్‌కుమార్, అమరగిరి, కొల్లాపూర్ మండలం

బయోవ్యర్థాల కాల్చివేతతో ముప్పు

జిల్లాలోని ఆస్పత్రులు, క్లినిక్‌లు, డయోగ్నోస్టిక్ సెంటర్లు, ల్యాబ్‌లు, ఆర్‌ఎంపీల క్లినిక్‌ల నుంచి వెలువడుతున్న బయోవ్యర్థాలను సంబంధిత ఇన్సినరేటరీలకు అప్పగించాల్సి ఉండగా.. చాలామంది నిబంధనలు పాటించకుండా మున్సిపాలిటీ చెత్త వాహనాల్లో వేస్తున్నారు. ప్రమాదకరమైన బయోవ్యర్థాలు, సిరంజీలు, మెడికల్ వేస్టేజ్ చెత్తలో కలుపుతున్నారు. మున్సిపల్ సిబ్బంది చెత్తను కాల్చినప్పుడు బయోవేస్టేజ్‌లోని ప్రమాదకర రసాయనాలు వాతావరణంలో కలిసిపోయి పరిసర ప్రాంతాల ప్రజల ఆరోగ్యానికి ముప్పుగా మారుతోంది. దీనిపై నాగర్‌కర్నూల్ మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి వివరణ కోరగా.. డంపింగ్‌యార్డులో చెత్త నిర్వహణకు చర్యలు తీసుకుంటామని, సెగ్రిగేషన్ షెడ్లను పకడ్బందీగా నిర్వహిస్తామన్నారు.

ఆయిల్‌పాం సాగులో ఆదర్శంగా నిలవాలి



మాదారంలో ఆయిల్‌పాం మొక్క నాటుతున్న కలెక్టర్ బాదావత్ సంతోష్

ఊర్కొండ: ఆయిల్‌పాం సాగుపై రైతుల దృష్టి సారించి, రాష్ట్రంలో నాగర్‌కర్నూల్ జిల్లా ఆదర్శంగా నిలవాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. బుధవారం ఊర్కొండ మండలంలోని మాదారంలో జిల్లా ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో రైతు శ్రీకాంత్‌కు చెందిన 10 ఎకరాల్లో చేస్తున్న ఆయిల్‌పాం ప్లాంటేషన్ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. మాదారం గ్రామం నుంచి శ్రీకాంత్ పొలం వరకు ట్రాక్టర్‌లో ప్రయాణించారు. మాదారంలోనే మరో రైతు కృష్ణారెడ్డి ఆయిల్‌పాం మొదటి క్రాప్ కట్టింగ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఆయిల్‌పాం తోటల సాగుకు పొలాలు అనుకూలంగా ఉన్నాయని ఆయిల్‌పాం పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు గతంలో ధ్రువీకరించారన్నారు.

రైతులకు ప్రోత్సాహకం

ఆయిల్‌పాం సాగు చేసే రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని తెలిపారు. ఒకసారి మొక్క నాటితే నాలుగేళ్లకు దిగుబడి ప్రారంభమై 30 ఏళ్లకు వస్తుందన్నారు. జిల్లాలో ఇప్పటికే 7 వేల ఎకరాల్లో ఆయిల్‌పాం సాగు చేసినట్లు వెల్లడించారు. జిల్లాలో 60 వేల మంది రైతులు 10 ఎకరాల పొలం కలిగిన ఉన్నారని, వారందరూ ఆయిల్‌పాం సాగుపై దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి వెంకటేశం, తహసీల్దార్ యూసఫ్‌అలీ తదితరులు ఉన్నారు.

మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండాలి

తాడూరు: విద్యార్థులకు ప్రభుత్వం అందించే మధ్యాహ్న భోజనంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ సిబ్బందికి సూచించారు. బుధవారం మండలంలోని సిర్సవాడ ఉన్నత పాఠశాలలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం తయారీ, పరిసరాల శుభ్రత అంశాలను స్వయంగా పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్యం, పోషణపై ప్రభుత్వం శ్రద్ధ తీసుకుంటుందని, దానికి అందరి సహకారం కావాలని కోరారు. విద్యార్థులకు అందించే నోట్, పాఠ్య పుస్తకాలు, దుస్తులు గురించి ఆరా తీశారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు లెక్కలు బోధించడంతో వారితో చేయించారు. సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

'బాలల హక్కుల పరిరక్షణకు కృషి చేద్దాం'

నాగర్‌కర్నూల్: బాలల హక్కుల పరిరక్షణ, పిల్లలందరికీ సమాన అవకాశాలు, విద్య, వైద్య సదుపాయాలు కల్పించేందుకు విద్య, వైద్య, పోలీస్, స్త్రీ శిశు సంక్షేమ, కార్మిక శాఖల అధికారులందరూ సమన్వయంతో పని చేయాలని తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ కొత్తకోట సీతా దయాకర్‌రెడ్డి సూచించారు. బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా పర్యటనలో భాగంగా బిజినేపల్లి, తాడూరు మండలాల్లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం, అంగన్‌వాడీ కేంద్రం, అనాథ బాలికల విద్యాలయాన్ని ఆమె సందర్శించారు. విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న వసతులు, అందుతున్న భోజనం, విద్యా తదితర అంశాలపై క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జ్యోతి ప్రజ్వలనతో చేసి సమీక్ష నిర్వహించారు. మిషన్ వాత్సల్య జిల్లా బాలల పరిరక్షణ విభాగం, బాలల హక్కుల పరిరక్షణ, వారి కోసం ఉద్దేశించిన చట్టాల అమలు తీరు గురించి చర్చించారు. కార్యక్రమంలో కమిషన్ సభ్యులు కంచర్ల వందనగౌడ్, అపర్ణ, మర్రిపల్లి చందన, గోగుల సరిత, ప్రేమలత అగర్వాల్, వచనకుమార్, సంబంధిత శాఖల అధికారులు, కలెక్టర్ బాదావత్ సంతోష్, అదనపు కలెక్టర్లు అమరేందర్, దేవసహాయం, అదనపు ఎస్పీ రామేశ్వర్, జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి రమాదేవి, జిల్లా బాలల సంరక్షణ చైర్మన్ లక్ష్మణరావు, డీఈఓ రమేష్‌కుమార్, జిల్లా బాలల సంరక్షణ అధికారి శ్రీశైలంగౌడ్, సీడీపీఓలు, సూపర్‌వైజర్లు, తదితర అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర బాలల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ సీతా దయాకర్‌రెడ్డి

మహిళల రక్షణే షీ టీం లక్ష్యం

- అదనపు ఎస్పీ రామేశ్వర్

నాగర్‌కర్నూల్ క్రైం: మహిళలు, బాలికల భద్రతకు షీ టీం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని జిల్లా అదనపు ఎస్పీ రామేశ్వర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యా సంస్థలు, మహిళలు పనిచేసే ప్రదేశాల్లో షీ టీం ఆధ్వర్యంలో విస్తృతంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జూన్‌లో మహిళలను వేధిస్తున్న వారిపై 10 ఫిర్యాదులు రాగా.. 2 క్రిమినల్ కేసులు, 4 పెట్టి కేసులు నమోదు చేయడంతో పాటు నలుగురు పోకిరీలకు కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సిలింగ్ ఇచ్చామని వెల్లడించారు. అమ్మాయిని వేధిస్తున్న వ్యక్తిని పట్టుకుని కేసు నమోదు చేశామన్నారు. షీ టీం ఆధ్వర్యంలో 13 అవగాహన సదస్సులు నిర్వహించినట్లు పేర్కొన్నారు. మహిళలు, విద్యార్థినులు ఒంటరిగా ప్రయాణిస్తున్న సమయంలో టీ సేఫ్ యాప్‌ను వినియోగించుకోవాలని, ప్రయాణంలో భరోసా ఇస్తుందన్నారు. విద్యార్థినులు, మహిళలు వేధింపులకు గురైతే వెంటనే షీ టీం 87126 57676 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

26 టిప్పర్ల ఇసుక డంప్ సీజ్

తిమ్మాజిపేట: అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హరిప్రసాద్‌రెడ్డి హెచ్చరించారు. మండలంలోని రాళ్ల చెరువుతండా సమీపంలో బుధవారం 26 టిప్పర్ల ఇసుక డంప్‌లను రెవెన్యూ, పోలీస్ అధికారులు సమన్వయంతో సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు. రాళ్లచెరువుతండా, ఆవంచ, బుద్ద సముద్రం, నేరళ్లపల్లి సమీపంలో దుందుభీ వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలించినా, అనుమతులు లేకుండా ఇసుక డంప్ చేసిన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రవిచంద్ర, జూనియర్ అసిస్టెంట్ ఉదయ్, కానిస్టేబుళ్లు శరత్‌గౌడ్, శ్రీనునాయక్ పాల్గొన్నారు.

అర్ధాకలితో అత్యవసర సిబ్బంది



- 108, 102 వాహన సిబ్బందికి అందని వేతనాలు
- ప్రభుత్వం నుంచి రెండు నెలలుగా విడుదల కాని నిధులు
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 380 మందిపై ప్రభావం

పాలమూరు: ఏదైనా రోడ్డు ప్రమాదం జరిగి గాయపడిన క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించాలంటే 108 వాహనాలు.. బాలింతలను ఇళ్ల దగ్గరకు చేర్చాలంటే 102 వాహనాలు ఉపయోగపడుతుంటాయి. అలాంటి అత్యవసర సమయాల్లో ప్రజలకు సేవలు అందించే 108, 102 వాహనాల పైలెట్స్, టెక్నీషియన్స్‌కు రెండు నెలల నుంచి జీతాలు లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు. జీతాలు లేకపోవడంతో కుటుంబ అవసరాలు తీర్చుకోవడానికి, ఇంటి అద్దెలు, పిల్లల చదువులు ఇలా ప్రతి విషయానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా ప్రస్తుతం పాఠశాలల పునఃప్రారంభమైన నేపథ్యంలో పిల్లలకు పాఠ్య పుస్తకాలు, యూనిఫాంలు, నోట్ బుక్స్ వంటివి కొనుగోలు చేయడానికి అప్పులు చేయాల్సిన పరిస్థితి దాపురించింది.

ఉమ్మడి జిల్లా పరిధిలో ఇలా..

జిల్లా	108 వాహనాలు	సిబ్బంది
మహబూబ్‌నగర్	16	64
నాగర్‌కర్నూల్	19	76
వనపర్తి	13	52
జోగులాంబ గద్వాల	11	44
నారాయణపేట	11	44

అధికారులు స్పందించాలి..



రెండు నెలలుగా జీతాలు అందకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం. ఎంఆర్ఐ సంస్థ టెండర్ ప్రకారం ప్రతి నెల జీతాలు ఇవ్వాల్సి ఉంది. కానీ, రెండు నెలల జీతాలు రాని విషయమై ఉన్నతాధికారులు సకాలంలో స్పందించి సిబ్బందికి జీతాలు ఇప్పించాలి. వేతనాలు రాకపోవడంతో కుటుంబాలు గడవటం చాలా కష్టంగా ఉంది.

– మాసన్న, 108 పైలెట్, మహబూబ్‌నగర్

రెండు, మూడురోజుల్లో..

ఉమ్మడి జిల్లాలో పనిచేస్తున్న 108, 102 సిబ్బందికి రెండు నెలలకు సంబంధించిన జీతాలు రావాల్సి ఉంది. ప్రభుత్వం నుంచి మరో రెండు, మూడు రోజుల్లో జీతాలు చెల్లించే అవకాశం ఉంది. నాలుగు స్లాబ్‌ల ప్రకారం సీనియర్, జూనియర్ సిబ్బందికి జీతాలు ఉంటాయి.

– రవికుమార్, ఉమ్మడి జిల్లా ప్రోగ్రాం మేనేజర్

■ ఈ ఏడాది ఏప్రిల్ వరకు జీతాలు వచ్చినా.. మే, జూన్ రెండు నెలలకు సంబంధించి జీతాలు అందలేదు. ఉమ్మడి జిల్లాలో '108' వాహనాలు 70 ఉండగా 280 మంది పనిచేస్తున్నారు. అలాగే '102' వాహనాలు 50 ఉండగా వంద మంది సిబ్బంది పనిచేస్తున్నారు. వీరికి రెండు నెలల జీతాలు కలిపి దాదాపు రూ.కోటికిపైగానే బకాయిలు రావాల్సి ఉంది.

మెడికల్ కాలేజీ, ఆస్పత్రిపై నజర్

- మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి
- మరో 305 పడకలు ఏర్పాటుకు కసరత్తు
- నిర్లక్ష్యం వీడని వైద్యులు



జనరల్ ఆస్పత్రిని తనిఖీ చేస్తున్న ఆరోగ్యశ్రీ సీఈఓ ఉదయ్‌కుమార్ (ఫైల్)

నాగర్‌కర్నూల్ క్రైం: స్థానిక ప్రభుత్వ మెడికల్ కళాశాలలో మౌలిక వసతులు కల్పించేందుకు అధికారులు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 27మెడికల్ కళాశాలల నిర్వహణపై నేషనల్ మానిటరింగ్ కమిటీ ఇటీవల అసంతృప్తి వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఇందులో నాగర్‌కర్నూల్ ప్రభుత్వ మెడికల్ కళాశాల ఉండటంతో అధికారులు దిద్దుబాటు చర్యలు చేపట్టారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలో తరగతులు ప్రారంభించి ఇప్పటికే మూడేళ్లు పూర్తి చేసుకుని నాలుగో సంవత్సరంలోకి ప్రవేశించడంతో నేషనల్ మెడికల్ కౌన్సిల్ ఆదేశాల అనుగుణంగా సదుపాయాలు కల్పించడంతో నాలుగో సంవత్సరం విద్యార్థులకు తరగతుల నిర్వహణకు అనుమతులు మంజూరు చేసినట్లు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి తెలిపారు.

కలెక్టర్ ఆధ్వర్యంలో నిరంతరం తనిఖీలు

జనరల్ ఆస్పత్రికి వచ్చే రోగులతో పాటు ప్రభుత్వ మెడికల్ కళాశాలలో విద్యార్థులకు అన్ని సదుపాయాలు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో కలెక్టర్ బాదావత్ సంతోష్ వాటిలో నిరంతరం తనిఖీలు నిర్వహిస్తూ, సిబ్బందికి తగు సూచనలు చేస్తున్నారు. ఇటీవలే ఆరోగ్యశ్రీ సీఈఓ ఉదయ్‌కుమార్ సైతం జనరల్ ఆస్పత్రిని, ప్రభుత్వ మెడికల్ కళాశాలను సందర్శించి మౌలిక వసతుల కల్పనకు కావాల్సిన వివరాలతో పాటు వైద్య విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ప్రొఫెసర్లు, అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్లు, బోధనేతర సిబ్బంది ఖాళీల వివరాలను, వైద్య పరికరాల గురించి ఆరా తీశారు. మెడికల్ కళాశాలకు అనుబంధంగా ఉన్న ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ప్రస్తుతం 300 పడకలు ఉండగా మరో 305 పడకలు అదనంగా ఏర్పాటు చేసేందుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తే వైద్యకళాశాల విద్యార్థులకు మెడికల్ ప్రాక్టీస్‌తో పాటు ఆస్పత్రికి వచ్చే రోగులకు పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందే అవకాశం ఉండనుంది.

తీరు మార్చుకోని వైద్యులు

ఐదు రోజుల క్రితం జనరల్ ఆస్పత్రి, మెడికల్ కళాశాలను ఆరోగ్యశ్రీ సీఈఓ, కలెక్టర్ తనిఖీ చేసేందుకు వచ్చి, వెళ్లిన రోజే ఎమర్జెన్సీ వార్డులో విధులు నిర్వహిస్తున్న ఓ వైద్యురాలు రోగులను పరీక్షించకుండా తన ఫోన్‌లో క్యాండిక్రష్ గేమ్ ఆడుతున్న వీడియో వైరల్‌గా మారడంతో పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రతిపాదనలు పంపాం



జనరల్ ఆస్పత్రితో పాటు ప్రభుత్వ మెడికల్ కళాశాలకు అవసరమయ్యే మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. ప్రభుత్వ మెడికల్ కళాశాలలో మరో 300 పడకల ఆస్పత్రిని త్వరలోనే ఏర్పాటు చేసి వైద్య విద్యార్థులకు ప్రాక్టీస్‌తో పాటు రోగులకు అన్ని వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నాం.

– డా.రఘు, జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్

అనుమతులు మంజూరయ్యాయి



ప్రభుత్వ మెడికల్ కళాశాలలో నాలుగో సంవత్సరం విద్యార్థులకు తరగతులను బోధించేందుకు ఎన్ఎంసీ నుంచి అనుమతులు మంజూరయ్యాయి. ప్రభుత్వ మెడికల్ కళాశాలలో విద్యార్థులకు కావాల్సిన అన్ని మౌలిక వసతులు కల్పిస్తున్నాం.

– డా.రమాదేవి, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్



క్లుప్తంగా

సంతానం లేదని వివాహిత ఆత్మహత్య


భువనేశ్వరి (ఫైల్)

అయిజ: సంతానం కలగలేదని మనస్తాపానికి గురైన వివాహిత ఫ్యాన్‌కు ఉరివేసుకొని మృతి చెందిన ఘటన పట్టణంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాసరావు కథనం ప్రకారం.. అయిజకు చెందిన వెంకటేశ్‌కు రెండేళ్ల క్రితం సమీప బంధువైన భువనేశ్వరి (23)తో వివాహమైంది. ప్రైవేటు దుకాణంలో వెంకటేశ్ గుమాస్తాగా పనిచేస్తుండగా భువనేశ్వరి ఇంటి వద్దే ఉండేది. వీరికి సంతానం లేకపోవడంతో భువనేశ్వరి తీవ్ర మనస్తాపానికి గురై మంగళవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుంది. ఇంటికి వచ్చిన భర్త తలుపు కొడితే తీయకపోవడంతో అనుమానం వచ్చి తలుపులు విరగొట్టి లోపలికెళ్లి చూస్తే భార్య ఫ్యానుకు వేలాడుతూ కనిపించింది. ఆస్పత్రికి తరలిస్తే అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి తండ్రి శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని, పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఉండవెల్లి: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. కుటుంబసభ్యులు, ఎస్‌ఐ శేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బుక్కాపురం గ్రామానికి చెందిన రంగస్వామి(40) బైక్‌పై మంగళవారం కర్నూల్ నుంచి బుక్కాపురం వెళ్తుండగా, వేగంగా వచ్చిన బొలెరో వాహనం ఢీకొట్టింది. దీంతో రంగస్వామి తలకు తీవ్ర గాయాలు కావడంతో వెంటనే కర్నూల్ ఆస్పత్రికి తరలించిన విషయం విధితమే. చికిత్స పొందుతూ రంగస్వామి మృతి చెందాడు. అతని భార్య కుర్వ సుజాత ఫిర్యాదు మేరకు బొలెరో వాహనం డ్రైవర్ నరేష్‌రెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రెండు ప్రాణాలు కాపాడిన పోలీసులు

ఎర్రవల్లి: కుటుంబ కలహాలతో ఓ వివాహిత జీవితంపై విరక్తి చెంది అభంశుభం తెలియని తమ ఏడాది బాలుడితో కలిసి బుధవారం కృష్ణానదిలో దూకి ఆత్మహత్యకు ప్రయత్నించగా, స్థానికంగా విధులు నిర్వహిస్తున్న పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి రెండు నిండు ప్రాణాలను కాపాడారు. ఎస్‌ఐ వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లా పెబ్బేరు మండలంలోని చెలిమిల్ల గ్రామానికి చెందిన మహిళ భర్తతో నిత్యం తగాదాల కారణంగా జీవితంపై విరక్తి చెందింది. తన కుమారుడితో కలిసి బీచుపల్లికి వచ్చి కృష్ణానది పుష్కరఘాట్ దగ్గర నదిలోకి దూకి ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించింది. ఈ క్రమంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న ఇటిక్యాల బ్లూకోర్ట్ పోలీసులు శ్రీనివాసులు, వాజిద్ లు దీనిని గమనించి చాకచక్యంగా వ్యవహరించి స్థానిక గజ ఈతగాళ్ల సహకారంతో మహిళతో పాటు బాలుడి ప్రాణాలతో కాపాడారు. అనంతరం ఆమె పూర్తి వివరాలను తెలుసుకొని కౌన్సెలింగ్ చేసి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు. వివాహిత ప్రాణాలను కాపాడిన పోలీస్ సిబ్బందిని పలువురు అభినందించారు.

'ఎన్‌ఎంఐఎంఎస్'కు న్యాక్ ఏ-ప్లస్ ప్లస్ గ్రేడ్

జడ్చర్ల టౌన్: మండలంలోని పోలేపల్లిలో ఉన్న ఎస్‌వీకేఎం ఎన్‌ఎంఐఎంఎస్ (డీమ్డ్ యూనివర్సిటీ)కి న్యాక్ ఏ ప్లస్ ప్లస్ గ్రేడ్ కేటాయించిందని వైస్ చాన్సలర్ డా. రమేశ్‌భట్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్ బృందం 4వసారి యూనివర్సిటీని సందర్శించి 3.67 అత్యుత్తమ సీజీపీఏతో ఏ ప్లస్ ప్లస్ గ్రేడ్ అందించిందని పేర్కొన్నారు. ఈ మైలురాయిలో అండగా నిలిచిన, సహకరించిన, లక్ష్యాన్ని విశ్వసించిన విద్యార్థులు, తల్లిదండ్రులు, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్, అకాడమిక్ కౌన్సిల్, విద్యార్థి సభ్యుల బోర్డు, పూర్వ విద్యార్థులకు అభినందనలు తెలిపా రు. లభించిన ఉత్తమ గ్రేడ్ దేశంలో ఉన్నత విద్యలో శ్రేష్ఠతకు బెంచ్‌మార్క్‌గా నిలుపుతుందని.. అంతర్జాతీయ విద్యాలయాలతో వ్యూహాత్మక భాగస్వాములను ఏర్పరచుకోగలుగుతుందని, అంతర్జాతీయ విద్యార్థులను ఆకర్షించగలుగుతుందన్నారు.

10 నుంచి స్వయం ఉపాధి శిక్షణ

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రంలోని వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రంలో జిల్లాలోని నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కోర్సుల్లో ఈ నెల 10 నుంచి 17వ బ్యాచ్ శిక్షణ ప్రారంభిస్తున్నట్లు డీవైఎస్‌ఓ (ఎఫ్ఏసీ) మధుసూదన్‌గౌడ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాస్ లేదా ఫెయిల్ అయిన యువతకు మూడు నెలలపాటు ఫ్యాషన్ డిజైనింగ్, గార్మెంట్ తయారీ, బ్యూటీషియన్, కంప్యూటర్ కోర్సు (ఎంఎస్ ఆఫీస్), రిఫ్రిజిరేషన్, ఎయిర్ కండిషన్, మొబైల్ సర్వీసింగ్ తదితర వాటిరిపేరుపై శిక్షణ ఇస్తారన్నారు. 7వ తరగతి పాసైన వారికి జర్దోసి, మగ్గం, ఎలక్ట్రీషియన్ కోర్సుల్లో శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణ అనంతరం పరీక్ష నిర్వహించి ఉత్తీర్ణులైన వారికి హైదరాబాద్ సెట్విన్ వారిచే సర్టిఫికెట్ అందజేస్తారన్నారు. ఆసక్తి గలవారు పాత డీఈఓ కార్యాలయంలోని వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రంలో ఈ నెల 9 వరకు దరఖాస్తులు అందజేయాలని కోరారు. దరఖాస్తు వెంట విద్యార్హత, ఆధార్ కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోతో జతచేయాలని సూచించారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కృష్ణమ్మ పరవళ్లు..

జూరాల జలాశయం నుంచి దిగువకు నీటిని విడుదల చేయడంతో కృష్ణా పరీవాహక ప్రాంతం జలకళను సంతరించుకుంది. వారం రోజులుగా నదిలో వరద ఉధృతి పెరుగుతూ వస్తోంది. సోమశిల, మంచాలకట్ట, మల్లేశ్వరం, జటప్రోలు, అమరగిరి ప్రాంతాల్లోని పుష్కరఘాట్లను తాకుతూ నది పారుతోంది. ఆయా ప్రాంతాలకు పర్యాటకుల తాకిడి పెరిగింది. నదీతీర ప్రాంతాలు పచ్చటి కొండలు, పరవళ్ల హోరులో కనువిందుగా మారాయి. - కొల్లాపూర్


అమరగిరిలో పుష్కరఘాట్ల వద్దకు చేరిన వరద


నదిలో నీటిమట్టం



వరద నీటిలో మునిగిన పస్పుల ప్రాథమిక పాఠశాల

వరద గుప్పిట్లో మూత'బడి'

ఉపాధ్యాయుల బోధనలు, విద్యార్థుల ఆటపాటలతో కళకళలాడాల్సిన పాఠశాల ఇలా వరద గుప్పిట్లో చిక్కుకొని మూతబడింది. చిన్నపాటి వర్షం కురిసినా నారాయణపేట జిల్లా మరికల్ మండలంలోని పస్పుల గ్రామ ప్రాథమిక పాఠశాలలోకి వరద నీరు చేరి చెరువును తలపిస్తోంది. వరద తగ్గిన తర్వాత దోమల బెడద, దుర్వాసనతో విద్యార్థులు చదువుకోలేకపోతున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే అధికారులు స్పందించి పాఠశాలలో వర్షపు నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. - మరికల్

వాట్సప్ లింక్ ద్వారా రూ.64,500 మాయం

గట్టు: పీఎం కిసాన్ పేరుతో వచ్చిన వాట్సప్ లింక్ ఓపెన్ చేసిన ఓ రైతు బ్యాంక్ నుంచి డబ్బులు మాయమైన సంఘటన గట్టులో చోటుచేసుకుంది. బాధిత రైతు కథనం ప్రకారం.. గట్టుకు చెందిన రైతు లక్ష్మన్న తన సెల్ నంబర్ (వాట్సప్)కు పీఎం కిసాన్ పేరుతో మెసేజ్ రావడంతో లింక్‌ను ఓపెన్ చేశాడు. దీంతో తన ఖాతాలో ఉన్న రూ.64,500 ఖాళీ అయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న రైతు బ్యాంక్‌లో అకౌంట్ చెక్ చేసుకోగా డబ్బులు బదిలీ అయ్యాయని బ్యాంక్ సిబ్బంది తెలిపారు. అప్పటికే ఖాతా నుంచి సైబర్ నేరగాళ్లు డబ్బులు తీసుకున్నట్లు పేర్కొన్నారు. దీంతో రైతు బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.


ఎస్‌ఐకు ఫిర్యాదు చేస్తున్న రైతు లక్ష్మన్న

విహారయాత్రలో విషాదం

తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం

- ఇద్దరు మృతి, ఐదుగురికి గాయాలు
- మృతులు వనపర్తి జిల్లా వాసులు
- యాత్ర ముగించుకొని తిరిగి వస్తుండగా ప్రమాదం


యుగంధర్‌రెడ్డి (ఫైల్)


సునితమ్మ (ఫైల్)

కొత్తకోట రూరల్: ఆధ్యాత్మిక క్షేత్రాలు, ఆహ్లాద ప్రాంతాల్లో వారం రోజుల పాటు ఆనందంగా గడిపి తిరిగి వస్తున్న ఆ కుటుంబంలో విహారయాత్ర తీవ్ర విషాదం నింపింది. తమిళనాడులో బుధవారం జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో వనపర్తి జిల్లాకు చెందిన ఇద్దరు మృత్యువాత పడగా.. మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఒకరి పరిస్థితి తీవ్ర విషమంగా ఉంది. వివరాల్లోకి వెళితే.. వనపర్తి జిల్లా కొత్తకోట మండలం పాలెం గ్రామానికి చెందిన సాయి దాబా నిర్వాహకుడు రాజు తన ఇద్దరు సోదరుల కుటుంబాలకు చెందిన 18 మంది పెద్దలు, నలుగురు పిల్లలు కలిపి మొత్తం 22 మంది జూన్ 26వ తేదీన ఓ మినీ బస్సు, ఇన్నోవా కారులో విహారయాత్రకు బయల్దేరారు. వారం రోజులు సంతోషంగా గడిపిన వారు బుధవారం ఉదయం తమిళనాడులోని భవానీమాతను దర్శించుకొని.. కొత్తకోటకు తిరుగు ప్రయాణమయ్యారు. మధ్యాహ్నం తమిళనాడులోని సేలం సమీపంలో ధర్మపురి బైపాస్ వద్ద ముందు వెళుతున్న లారీ సడన్ బ్రేక్ వేయడంతో.. దానికి వెనుకే వచ్చిన ఇన్నోవా కారు బలంగా ఢీకొట్టింది. దీంతో కారులో ఉన్న పెద్దమందడి మండలం దొడగుంటపల్లి గ్రామానికి చెందిన యుగంధర్‌రెడ్డి (50), మదనాపురం మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన సునితమ్మ (58) అక్కడికక్కడే మృత్యువాతపడ్డారు. మరో ఐదుగురికి తీవ్ర గాయాలు కావడంతో స్థానికంగా ఆస్పత్రిలో చికిత్స చేయించారు. ప్రమాద సమయంలో కారులో ఐదుగురు పెద్దవారితో పాటు నలుగురు పిల్లలున్నారు. గాయపడిన వారిలో పురుషోత్తమ్మ పరిస్థితి విషమంగా ఉండడంతో బెంగళూరు ఆస్పత్రికి తరలించారు.


ప్రమాదానికి గురైన కారు


ప్రమాదానికి కారణమైన లారీ

వివాదాస్పద భూమి ఎన్‌ఓసీ అందించండి

జడ్చర్ల: పట్టణంలోని వంద పడకల ఆస్పత్రి దగ్గర తమ కుటుంబ సభ్యులు ఎన్‌ఓసీ ఉన్న భూమిని కొనుగోలు చేశారని చెబుతున్న మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి వారం రోజుల్లో సంబంధిత ఎన్‌ఓసీ ప్రతిని స్థానిక తహసీల్దార్‌కు అందించాలని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఇటీవల తాను చేసిన ఆరోపణలపై మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడిన వ్యాఖ్యలపై ఎమ్మెల్యే స్పందించారు. తనకు రాచరిక పాలన అంటే ఏమిటో తెలియదన్నారు. ఆస్పత్రి వద్ద మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అక్క పేరున భూమి ఉండటంతోనే తాను మాట్లాడానని, పేరు లేకపోతే మాట్లాడేవాడిని కాదన్నారు. ఈ భూమికి సంబంధించిన ఎన్‌ఓసీ రెవెన్యూ కార్యాలయంలో లేదని, దీని డాటా ఇవ్వాలని ఇప్పటికే అధికారులు నోటీసులు జారీచేశారన్నారు. తన మేనల్లుడి పేరిట 1,200 చ.గ స్థలం ఉందని స్వయంగా మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి చెప్పారని ఆ స్థలాన్ని ఎప్పుడు ప్రభుత్వానికి వెనక్కి ఇస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే మాజీ ఎమ్మెల్యే మాట్లాడినట్లు తన తల్లి ఎక్కడా భూ లావాదేవీలు జరపలేదన్నారు. ఆమె మాజీ సర్పంచ్‌గా పనిచేసిన అనుభవం ఉండడంతో హస్తవాసి బాగుంటుందని కొందరు అభిమానంతో ఇందిరమ్మ ఇళ్లకు ముగ్గు పోయించుకుంటున్నారని చెప్పారు. తాము బీఆర్ఎస్, బీజేపీ నాయకులతో సైతం కలిసి ముగ్గులు పోయడం, ప్రొసీడింగ్స్ ఇవ్వడం చేస్తున్నామన్నారు. మీ హయాంలో తమ పార్టీల వారిని ఎక్కడా దగ్గరకు రానివ్వలేదని దుయ్యబట్టారు. మాజీ ఎమ్మెల్యే తమపై చేసిన ఆరోపణలకు త్వరలోనే విలేకరుల సమావేశంలో అన్ని వివరాలు చెబుతానని చెప్పారు.

జడ్చర్లను నంబర్ 1 చేస్తా..

జడ్చర్ల నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధిపరిచి నంబర్ 1 చేస్తానని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి తెలిపారు. బాలానగర్ మండలంలోని మోతీఘనపూర్‌లో రూ.50 లక్షలు, గోప్లాపూర్‌లో రూ.25 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్లు, అండర్ డ్రెయినేజీ పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కొత్తగా వేసిన తాగునీటి బోర్లను ప్రారంభించారు. గత బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో అభివృద్ధిలో నిర్లక్ష్యం వహించారని, ఎక్కడా పేదలకు ఇళ్లు, రేషన్‌కార్డులు ఇచ్చిన దాఖలాలు లేవన్నారు.


మోతీఘనపూర్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

జూరాలకు తగ్గిన వరద

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న వరద బుధవారం స్వల్పంగా తగ్గినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. మంగళవారం 87 వేల క్యూసెక్కులు ఉండగా.. బుధవారం సాయంత్రానికి 67 వేల క్యూసెక్కులకు చేరింది. దీంతో ప్రాజెక్టు 5 క్రస్ట్‌గేట్లను ఎత్తి 32,650 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. విద్యుదుత్పత్తి నిమిత్తం 31,380 క్యూసెక్కులు, కోయిల్‌సాగర్‌కు 315, భీమా లిఫ్ట్–1కు 650, ఆవిరి రూపంలో 42, ఎడమ కాల్వకు 550, కుడి కాల్వకు 280, ఆర్‌డీఎస్ లింక్ కెనాల్‌కు 150, సమాంతర కాల్వకు 450, భీమా లిఫ్ట్–2కు 750 క్యూసెక్కుల నీటిని వినియోగించినట్లు వివరించారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 7.060 టీఎంసీలు ఉన్నట్లు తెలిపారు.

174.784 మి.యూ. విద్యుదుత్పత్తి..

ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు దిగువ, ఎగువ జల విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి వేగంగా కొనసాగుతోంది. బుధవారం ఎగువ 5 యూనిట్ల నుంచి 195 మెగావాట్లు, 79.443 మి.యూ., దిగువ 6 యూనిట్ల నుంచి 240 మెగావాట్లు, 95.341 మి.యూ. విద్యుదుత్పత్తి చేపట్టినట్లు ఎస్ఈ శ్రీధర్ తెలిపారు. రెండు ఉత్పత్తి కేంద్రాల్లో ఇప్పటి వరకు 174.784 మి.యూ. విజయవంతంగా పూర్తి చేశామని చెప్పారు.


ప్రాజెక్టు నుంచి దిగువకు పారుతున్న వరద

శ్రీశైలం ప్రాజెక్టుకు 64,030 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

దోమలపెంట: జూరాల క్రస్ట్‌గేట్లు, విద్యుదుత్పత్తి నుంచి శ్రీశైలం ప్రాజెక్టుకు 64,030 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతుంది. ప్రస్తుతం జలాశయంలో 875.6 అడుగుల నీటిమట్టం వద్ద 166.3148 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ఎడమగట్టు భూగర్భ జలవిద్యుత్ కేంద్రంలో 16.892 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి చేసి 33,639 క్యూసెక్కులు, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో 8.722 మి.యూనిట్లు ఉత్పత్తి చేసి 15,836 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు.

6న కురుమూర్తిస్వామికి లక్ష పుష్పార్చన

చిన్నచింతకుంట: ఉమ్మడి పాలమూరు వాసుల ఆరాధ్యదైవమైన అమ్మాపురం కురుమూర్తిస్వామి ఆలయంలో శయనేకాదశి (తొలి ఏకాదశి)ని పురస్కరించుకొని ఆదివారం స్వామివారికి లక్ష పుష్పార్చన కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ఆలయ సిబ్బంది స్వామివారి ప్రధాన ఆలయ ప్రాంగణంలో రకరకాల పూలతో అలంకరిస్తారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు పట్టువస్త్రాలు ధరింపజేసి అలంకరణ మండపంలో ఉంచుతారు. ఈ ఉత్సవంలో వివిధ గ్రామాలకు చెందిన దంపతులు జంటగా పాల్గొంటారు. ఆలయ అర్చకుల వేద మంత్రోచ్ఛరణాలతో అమ్మవార్లకు పుష్పార్చన ఘనంగా కొనసాగనుంది. కార్యక్రమానికి ఉమ్మడి పాలమూరు జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

ఇవీ కార్యక్రమాలు..

తొలి ఏకాదశిని పురస్కరించుకొని కురుమూర్తి స్వామి ఆలయంలో ఆది, సోమవారాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఆదివారం ఉదయం 6 గంటలకు సుప్రభాతసేవ, 6.30 గంటలకు స్వామి, అమ్మవార్లకు పంచామృతాభిషేకం, 9 గంటలకు విశ్వక్‌సేవ పూజ, పుణ్యాహవచనం, 10 గంటలకు స్వామివారికి లక్ష పుష్పార్చన, రాత్రి 7 గంటలకు అమ్మవారికి కుంకుమార్చన, 8 గంటలకు ప్రదోషకాల పూజ, 9 గంటలకు తీర్థ ప్రసాద వితరణ, 10 గంటలకు అఖండ భజన ఉంటుంది. అలాగే సోమవారం ఉదయం 7 గంటలకు సహస్ర నామార్చన, 9 గంటలకు మహానివేదన, 9.30 గంటలకు తీర్థప్రసాద వితరణ చేపడుతారు.


కురుమూర్తిస్వామి ప్రధాన ఆలయం

■ తొలి ఏకాదశిని పురస్కరించుకొని కురుమూర్తిస్వామికి సహస్ర పుష్పార్చన జరిపించే భక్తులు ఆలయ కార్య నిర్వహణాధికారి కార్యాలయంలో రూ.151 చెల్లించి తమ పేర్లు నమోదు చేసుకోవాలని ఈఓ మధనేశ్వర్‌రెడ్డి, చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి కోరారు.

చేనేత కార్మికులకు జియోట్యాగ్ నంబర్లు

చేనేత జౌళిశాఖ రాష్ట్ర ఉప సంచాలకులు పద్మ


అమరచింతలో కొత్తగా మగ్గంపై జరీ చీరల తయారీని పరిశీలిస్తున్న ప్రాంతీయ ఉప సంచాలకురాలు పద్మ

అమరచింత: మగ్గాలపై ఆధారపడి జీవిస్తున్న నేత కార్మికులందరికి ప్రభుత్వం జియోట్యాగ్ నంబర్లు జారీ చేస్తూ సంక్షేమ పథకాలు అందించడానికి సిద్ధంగా ఉందని చేనేత జౌళిశాఖ ప్రాంతీయ ఉప సంచాలకులు పద్మ వెల్లడించారు. మండల కేంద్రంలోని చేనేత ఉత్పత్తుల సంఘంలో చేనేత మగ్గాలపై జీవనం పొందుతూ జియోట్యాగ్ నంబర్ కోసం దరఖాస్తు చేసుకున్న కార్మికులను ఆమె బుధవారం ఆకస్మికంగా సందర్శించి కార్మికుల వివరాలు సేకరించారు. ఈ మేరకు అక్కడే ఉండి మగ్గాలపై జరీ చీరలను తయారు చేస్తున్న దరఖాస్తుదారులతో మాట్లాడారు. కొంతకాలంగా మగ్గాలను వదిలామని, ప్రస్తుతం స్థానికంగా ఉపాధి ఉండటంతో మళ్లీ మగ్గాలపై నేత పనులను చేపడుతున్నామని, తమకు జియోట్యాగ్ నంబర్లు కేటాయించి ఆదుకోవాలని నేత కార్మికులు కోరారు. దీంతో ఆమె మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ జియోట్యాగ్ నంబర్‌ను కేటాయిస్తామన్నారు. గద్వాల ఏడీ పరిధిలోని గద్వాల, వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా గత ఆరు నెలల కిందట జియోట్యాగ్ కోసం 200 మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. దీంతో నేరుగా వృత్తిలో ఉన్నారా లేదా అనే వివరాలను తెలుసుకోనేందుకు మాచర్ల, అరగిద్ద, గోర్లకాన్ దొడ్డి, అమరచింత గ్రామాలను సందర్శించినట్లు తెలిపారు. ప్రభుత్వ నిబంధనల మేరకు నేత పనులతో ఉపాధి పొందుతున్న కార్మికుడు తనకు జియోట్యాగ్ నంబర్ కావాలంటే కనీసం నేత పనుల్లో 6 నెలల అనుభవం ఉండాలని సూచించారు. 6 నెలల కిందట కొత్తగా జియోట్యాగ్ కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను పూర్తిస్థాయిలో పరిశీలించామని, త్వరలోనే వారికి నంబర్లను కేటాయిస్తామన్నారు. గద్వాల చేనేత జౌళిశాఖ కార్యాలయం పరిధిలో జియోట్యాగ్ నంబర్లు కలిగిన కార్మికులు 2800 మంది ఉన్నారని వెల్లడించారు. కార్యక్రమంలో చేనేత జౌళిశాఖ ఏడీ గోవిందయ్య, ఫీల్డ్ ఆఫీసర్ ప్రియాంక ఉన్నారు.

వీరన్నపేట సమీపంలో మళ్లీ కనబడిన చిరుత


- భయాందోళనతో అధికారులకు సమాచారం
- ఫారెస్టు అధికారులు, పోలీసుల పరిశీలన

మహబూబ్‌నగర్ న్యూటౌన్: మహబూబ్‌నగర్ మున్సిపాలిటీలోని వీరన్నపేట పరిధిలో హెచ్‌ఎస్ ఫంక్షన్ హాలు సమీపంలోని గుట్ట మీద రాళ్లపై చిరుత సంచరిస్తున్న ఫొటోలు, వీడియోలు బుధవారం సోషల్ మీడియాలో వైరలయ్యాయి. స్పందించిన ఏడుగురు ఫారెస్టు సెక్షన్ అధికారులు, బీట్ ఆఫీసర్ల బృందం చిరుత సంచరిస్తున్న ప్రాంతానికి చేరుకొని పరిశీలించారు. ఫారెస్టు అధికారులతో పాటు పోలీసులు అక్కడికి చేరుకొని ప్రజలను అప్రమత్తం చేశారు. స్థానికులు స్వయంగా చిరుతను చూసినట్లు తెలపడంతో గుట్టపై బోనుతోపాటు సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఫారెస్టు రేంజ్ అధికారి సయ్యద్ కమాలుద్దీన్ తెలిపారు. అడవిలో చిరుతల సంతతి పెరిగినందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

గాధిర్యాల్ అటవీప్రాంతంలో చిరుత కలకలం

మహమ్మదాబాద్: మండలంలోని గాధిర్యాల్ అటవీ ప్రాంతంలోని ఓగుట్టపై చిరుత ఉండడం కలకలం రేపింది. బుధవారం సాయంత్రం పొలాల నుంచి వస్తున్న రైతులు గుట్టపై ఓ గుండు మీద ఉన్న చిరుతను చూశారు. వెంటనే అక్కడ దారిగుండా వెళ్తున్న పలువురు రైతులు కలిసి కొంత దగ్గరికి వెళ్లి చూడగా.. గుండుపై చిరుత ఉండడాన్ని గమనించారు. వెంటనే పలువురు రైతులు కెమెరాలో చిరుత ఫొటోలు తీశారు. అక్కడే చాలామంది గుమిగూడి దాన్ని పరిశీలిస్తుండగా.. అక్కడి నుంచి వెళ్లిపోయినట్టు రైతులు తెలిపారు. చిరుత సంచారంతో గ్రామస్తులు, దగ్గరలోని రైతులు భయాందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు చిరుత సంచారాన్ని గమనించి రైతులు భయభ్రాంతులు చెందకుండా అవగాహన కల్పించాలని తెలిపారు.


చిరుత సంచారంపై ప్రజలను అప్రమత్తం చేస్తున్న పోలీసులు, ఫారెస్టు అధికారులు


గాధిర్యాల్ అటవీప్రాంతంలో ఓగుట్టపై కనిపిస్తున్న చిరుత

తండ్రిపై కుమారుడి దాడి

పాన్‌గల్: తండ్రిపై దాడిచేసి గాయపర్చిన సంఘటనలో బుధవారం కుమారుడిపై కేసు నమోదైన సంఘటన చోటుచేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బుసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన నాగేంద్రానికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. నాగేంద్రం చిన్న కుమారుడు రాఘవేంద్ర కూలీ పని చేస్తూ హైదరాబాద్‌లో జీవనం సాగిస్తున్నాడు. తండ్రి పేరు మీద ఉన్న ఎకరం పొలం విషయంలో తరుచూ గొడవలు చేస్తుండేవాడు. గతనెల 30న స్వగ్రామానికి రాఘవేంద్ర వచ్చాడు. ఈనెల 1న ఎకరం భూమి విషయంలో తండ్రితో వాగ్వివాదం చేసి గొడవపడి కట్టెతో తండ్రిపై దాడి చేసి గాయపర్చాడు. గాయపడిన నాగేంద్రంను జిల్లా ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి మహబూబ్ నగర్ ఆస్పత్రికి తరలించారు. భూమి విషయంలో ఘర్షణ పడి తండ్రిపై కట్టెతో దాడి చేయడంతో కూతురు లక్ష్మీదేవమ్మ బుధవారం ఫిర్యాదు చేసింది. ఈ మేరకు రాఘవేంద్రపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

